క్లుప్తంగా...

నేటి నుంచి శతచండీ మహాయాగం



చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ఈనెల 23వ తేదీ నుంచి రుద్ర సహిత శ్రీ శతచండీ మహాయాగం పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి ఈ మహాయాగాన్ని ప్రారంభించనున్నారన్నారు. 23న ప్రారంభమయ్యే ఈ మహాయాగం వచ్చే నెల 14వ తేదీ వరకు వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. ఈ మహాయాగంలో పాల్గొనదలచిన భక్తులు 93945 25457, 97033 85020, 93948 28268లలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



అబిడ్స్: ధూల్‌పేట నాయీ బస్తీలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లల్లో అమరవీరుల కుటుంబాలకు కేసీఆర్ ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. కేవలం ప్రచారమే తప్పా.. ప్రభుత్వానిది ప్రగతి లేదని ఆయన అన్నారు. శ్యామ్‌సింగ్, రఘునందన్ యాదవ్, శంకర్‌సింగ్, సంతోష్ సింగ్, శ్రీధర్ పాల్గొన్నారు.

యోగాతో ఎన్నో లాభాలు



స్కూల్ ఆడిటోరియంలో యోగా చేస్తున్న విద్యార్థులు

జియాగూడ: యోగాతో ఆరోగ్య పరిరక్షణతో పాటు భవిష్యత్తులో ఎలాంటి వ్యాధులు దరిచేరవని జియాగూడ విద్యశ్రీ హైస్కూల్ డైరెక్టర్ శ్యామ్‌వెర అన్నారు. ఈ మేరకు గురువారం స్కూల్ ఆడిటోరియంలో యోగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌వెర మాట్లాడుతూ.. విద్యార్థులకు యోగా ద్వారా చదువులకు తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు సూర్యనమస్కారాలు, యోగా నిర్వహించారు.

బావిలో పడ్డ ఆవును కాపాడిన యాదవులు

గోల్కొండ: మేత మేస్తూ ఓ ఆవు పురాతన బావిలో పడింది. కాగా దీన్ని గమనించిన స్థానిక యాదవులు ఆ గోవును రక్షించారు. కార్వాన్ యాదవ సంఘం ప్రతినిధి గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిమల్కాపూర్‌లోని అన్నపూర్ణ ఆలయ ఆవరణలో ఓ ఆవు మేత కోసం వచ్చింది. మేత మేస్తూ ఆ ఆవు పొరపాటున అక్కడ ఉన్న పురాతన పాడుపడిన బావిలో పడింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కార్వాన్ యాదవ సంఘం సభ్యులు ఆవుకు గాయాలు కాకుండా తాళ్లను కట్టారు. అనంతరం క్రేన్ సాయంతో బయటకు తీశారు.

భారత ఆహార సంస్థలో యోగా దినోత్సవం



ఎఫ్‌సీఐలో యోగా చేస్తున్న అధికారులు

నాంపల్లి: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగులు పలు రకాల యోగాసనాలను ప్రదర్శించారు. ప్రముఖ యోగా నిపుణులు, ఏజీ–3 (టెక్నికల్) ఎం.జీ.చందన ప్రత్యేక అతిథిగా హాజరై యోగాసనాల్లో తర్ఫీదును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎం(ఆర్) దీపక్ శర్మ, డీజీఎం (జి) రోహిత్ గార్గ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: ప్రైవేటు పాఠశాలలు బుక్స్, యూనిఫామ్స్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయాలను వసూళ్లు చేస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్ అన్నారు. అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీఈఓ రోహిణికి వినతిపత్రం అందజేశారు.ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలు అడ్డగోలుగా ఫీజులను పెంచడమే కాకుండా పుస్తకాల పేరుతో వేల రూపాయాలు దండుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.



500 బోనాలు సమర్పిస్తున్న కుమ్మరి సంఘం వారు



బోనం.. వైభవం

- ప్రారంభమైన గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాలు
- పాతబస్తీలో కనుల పండువగా బంగారు బోనం
- గౌలిపురా నుంచి గోల్కొండ కోటకు సామూహిక ఊరేగింపు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు



ఊరేగింపులో రోబోటిక్ అంబారీ

గోల్కొండ: గోల్కొండ కోట బోనం ఎత్తింది. గోల్కొండ జగదాంబిక మహంకాళీ అమ్మవారి ఆషాఢమాసం బోనాల తొలి పూజ గురువారం వైభవంగా ప్రారంభమైయ్యాయి. గోల్కొండ కోటకు వెళ్లే రహదారి భక్తుల బారులతో కిటకిటలాడాయి. లంగర్‌హౌజ్, రాందేవ్‌గూడ, ఎండీ లైన్స్, బంజారా దర్వాజ తదితర ప్రాంతాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఫతేదర్వాజ నుంచి అమ్మవారి ఘటం ఊరేగింపునకు అడుగడుగునా భక్తులు మొక్కారు. చోటా బజార్, బడా బజార్ రోడ్డుకు ఇరువైపుల భారీ సంఖ్యలో భక్తులు చేరి అమ్మవారి పటానికి స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక శాఖ వారు అమ్మవారి ఘటాలతో అలంకరించిన వాహనాలు అందరిని ఆకట్టుకున్నాయి. కోట చౌరస్తా వద్ద పోతరాజుల విన్యాసాలు చూసి భక్తులు పరవశులైయ్యారు.

ఆకట్టుకున్న నజర్ బోనం ఊరేగింపు..

జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి ఆధ్వర్యంలో రిసాలబజార్ శివాలయం నుంచి ప్రారంభమైన నజర్ ఊరేగింపు కోట బోనాలకే హైలెట్‌గా నిలిచింది. ఈ ఊరేగింపులో మొదటిసారిగా రోబోటిక్ అంబారీపై అమ్మవారి ఘటాన్ని పెట్టి రిసాలబజార్ నుంచి గోల్కొండ కోట చౌరస్తా వరకు తెచ్చారు. రోబోటిక్ అంబారీపై కూర్చున్న బొమ్మల శ్రీకాంత్‌చారి భక్తులను ఆశీర్వదిస్తూ ముందుకు సాగారు. కోటలోకి ప్రవేశించిన ఈ రోబోటిక్ అంబారీపై కూర్చున్న శ్రీకాంత్‌చారీ రెండు ప్లాస్టిక్ రివాల్వర్లతో బానాసంచా కాల్చడం అందరిని ఆకట్టుకుంది.

భారీ బందోబస్తు...

వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్‌ఖరే నేతృత్వంలో ఆసిఫ్‌నగర్ ఏసీపీ శివమారుతీ ఫతేదర్వాజ నుంచి గోల్కొండ కోట వరకు ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. కాగా అశ్వకదళం సేవలను కూడా పోలీసులు వినియోగించుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తన సిబ్బందితో వాహనాల రాకపోకలను పర్యవేక్షించారు. కోటపైకి వెళ్లే మార్గంలో మహిళా పోలీసు టీమ్‌లు సైతం విధులు నిర్వహించారు. కాగా నగర కొత్వాల్ సీవీ ఆనంద్ కోటకు వచ్చి బందోబస్తు పర్యవేక్షించారు.

పాతబస్తీలో..

చార్మినార్: పాతబస్తీలో గురువారం బంగారు పాత్రలోని నైవేద్యంతో పాటు పట్టు వస్త్రాలతో నిర్వహించిన సామూహిక ఊరేగింపు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. జోగిని నిషా క్రాంతి గౌలిపురాలోని కోట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపు ప్రారంభమైంది.

బ్యాండ్ మేళాలు.. పోతరాజుల నృత్యాలు..

దారి పొడవున భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జోగిని నిషా క్రాంతి తలపై బంగారు బోనాన్ని పెట్టుకొని చేతిలో చర్నకోలా పట్టుకొని దారి పొడవున నృత్యాలు చేస్తుండగా.. అక్కడక్కడ మహిళా భక్తులు మంచినీటితో సాక పోసి స్వాగతం పలికారు. గౌలిపురా కోట మైసమ్మ ఆలయం నుంచి బయలుదేరిన సామూహిక ఊరేగింపు గౌలిపురా మార్కెట్, బేలా ముత్యాలమ్మ, లాల్‌దర్వాజా మోడ్ మీదుగా లంగర్‌హౌజ్‌కు చేరుకొని గోల్కొండ కోటకు బయలుదేరింది. కోటలో అమ్మవారికి శాస్త్రోక్తంగా బోనం, పట్టు వస్త్రాలను సమర్పించారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్, ప్రధాన కార్యదర్శి గాజుల రాహుల్, ఉపాధ్యక్షులు శ్రీధర్, కార్యదర్శి భవానీ శంకర్‌తో పాటు కమిటీ మాజీ అధ్యక్షులు గాజుల అంజయ్య, మధుసూదన్ గౌడ్, రాకేశ్ తివారీ, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఆలే జీతేంద్ర, ప్రతినిధులు కె.ఎస్.ఆనంద్ రావు, ప్యారసాని వెంకటేశ్, ఆదర్ల మహేశ్ పాల్గొన్నారు.

75వ బోనాల వజ్రోత్సవాల్లో భాగంగా ..

యాకుత్‌పురా: హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం 75వ బోనాల వజ్రోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ తరపున గోల్కొండ జగదాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు ఆలయ కమిటీ అధ్యక్షులు రాందేవ్ అగర్వాల్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు తరలివెళ్లారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రాజారత్నం, డాక్టర్ భరత్ ప్రకాశ్, సతీష్ కుమార్, క్రాంతికుమార్, ప్రభాకర్, జగన్‌మోహన్ కపూర్ ఉన్నారు.

లంగర్‌హౌస్ నుంచి..

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్‌లో జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో బోనాలు ప్రారంభించి పోతరాజుల నృత్యాలు, శివసత్తుల పూనకాలతో కోటపైకి ఊరేగింపు సాగింది. చోటా బజార్‌లోని ప్రధాన పూజారి ఇంటి నుంచి అమ్మవారి నగలు, పల్లకీ సేవ, విగ్రహాల ఊరేగింపు కోటపైకి వెళ్లగా యువతులు, మహిళలు సాక సమర్పిస్తూ స్వాగతం పలికారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జీవన్‌సింగ్, కావూరి వెంకటేష్, ప్రముఖ సంఘ సేవకులు రాజువస్తాద్‌ల సమక్షంలో ఊరేగింపు కొనసాగింది. పాతబస్తీ జంట ఆలయాల నుంచి వచ్చిన బంగారు బోనంకు వరదరాజ్, సాయిరాజ్ స్వాగతం పలికారు. వసంత్‌రెడ్డి, నాగేష్, రేణుక, పుష్ప, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, పరమేష్, కార్తీక్ పాల్గొన్నారు.

అమ్మవారికి 500 బోనాలు..

బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ కుమ్మర గోల్కొండ బోనాల ఉత్సవ సమితి తరపున భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి కుమ్మర్లు తరలివచ్చి గోల్కొండ కోటపై వెలసిన జగదాంబిక అమ్మవారికి 500 బోనాలు సమర్పించారు. పోతరాజులు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా వెళ్లారు. రాష్ట్ర అధ్యక్షులు రావులకోళ్ల విజయ్‌కుమార్, అనీల్‌కుమార్, సంతోష్ కుమార్, వ్యాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బంగారు బోనంకు పూజలు నిర్వహిస్తున్న వరదరాజు, సాయిరాజు



నాగదేవతకు పూజలు నిర్వహిస్తున్న అమర్‌సింగ్



అమ్మవారిని దర్శించుకుంటున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్



జోగిని నిషా క్రాంతి బంగారు బోనంతో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



గోల్కొండకు బంగారు బోనంతో వెళ్తున్న ప్రతినిధులు



తొట్టెల పూజలో మాజీ చైర్మన్ వసంత్‌రెడ్డి, కార్తీక్



అమ్మవారి నగలు, విగ్రహాలను కోటపైకి తీసుకెళుతున్న దృశ్యం



బోనాలు తీసుకెళుతున్న మహిళలు

'ఉపా' చట్టాన్ని రద్దు చేయాలి

నాంపల్లి: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు విమలక్క, మోహన్ బైరాగితో పాటుగా 152 మందిపై ములుగు పోలీసులు బనాయించి అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ఎదుట ఉన్న గన్‌పార్కు వద్ద గురువారం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) ఏఐఎఫ్‌టీయూ, ప్రజా సంఘాలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమలక్క మాట్లాడుతూ.. ప్రజా పక్షం వహించే వారిపై ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమైన చర్య అని, ములుగు కుట్ర కేసును బేషరతుగా వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ లక్ష్మి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు రమేష్, రాకేష్, హఫీజ్, మహిళా సంఘం నాయకులు పద్మ, లక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నేతలు

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

విజయనగర్‌కాలనీ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 విశ్వ విద్యాలయాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు 1356 మందిని రెగ్యులరైజ్ చేయాలని గురువారం ఆందోళన నిర్వహించారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్‌నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రధాన ద్వారం ముందు బ్యానర్లు, ప్లకార్డులు చేతబట్టి కాంట్రాక్ట్ అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ కో చైర్మన్ హరీష్, కో కన్వీనర్ ఆదిత్యమూర్తి, మహిళా కన్వీనర్ హర్షిత, మను, రమణమూర్తి, షేక్ సమీర్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర ఎనలేనిది



కేఆర్ రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆయాచితం శ్రీధర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర ఎనలేనిదని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. గురువారం టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల ధూమ్ దామ్ కార్యక్రమానికి డీఈఓ కార్యాలయం నుంచి విద్యాశాఖ కార్యాలయం ఉద్యోగులు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగులు చూపిన తెగువ మరిచిపోలేనిదన్నారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ విభాగం నగర అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ కేంద్రకమిటీ అధ్యక్షులు రాజేందర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి విక్రమ్‌కుమార్, విద్యాశాఖ ఉద్యోగులు భాస్కర్, డేవిడ్, ప్రేమ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ దశాబ్ది ముగింపు వేడుకలు జోరుగా నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా బీఆర్ఎస్ ర్యాలీలు నిర్వహించారు. నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ నుంచి ర్యాలీ ప్రారంభమై గోషామహల్, దారుసలాం మీదుగా గన్‌పార్క్, ట్యాంక్‌బండ్ వరకు చేరుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, ముత్యాల గోవింద్ రాజ్, పప్పుమాత్రే, అశ్వినిమార్గం, ఆనంద్‌సింగ్, అనిత, సంతోషిలతో పాటు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అబిడ్స్ నుంచి...

అబిడ్స్ నుంచి ఆశీష్‌కుమార్ యాదవ్ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆదర్శ్‌నగర్ నుంచి బీఆర్ఎస్ నాయకులు సంతోష్ గుప్తా, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తాల ఆధ్వర్యంలో గన్‌పార్క్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. వీరితో పాటు ఆల పురుషోత్తమ్, రామ్‌చందర్ రాజు తదితరులు తరలి వచ్చారు.

టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో..

హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో దశాబ్ది ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళలకు, పలు రంగాల్లో నైపుణ్యం చెందిన వారిని ఎస్ఎం ముజీబ్ ఘనంగా సత్కరించారు. విక్రమ్‌కుమార్, రాజ్‌కుమార్, బాల్‌రాజ్, శ్రీనివాస్, నరేష్‌కుమార్, హరిబాబు, వైదిక్ శాస్త్రి, శంకర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నాంపల్లి నుంచి..

నాంపల్లి: తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం ప్రారంభోత్సవానికి నాంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో అన్ని డివిజన్ల ప్రజలు భారీగా తరలివెళ్లారు. నాంపల్లి నుంచి ర్యాలీగా గన్‌పార్కుకు చేరుకుని అక్కడ తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్దకు చేరుకున్నారు. బీఆర్ఎస్ నేతలు అశ్విన్ మార్గం, పూజారీ లాల్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్‌కు ర్యాలీగా వచ్చిన ఎమ్మెల్సీ కవిత




గోషామహల్ నుంచి.. నందకిశోర్ వ్యాస్ బిలాల్



అబిడ్స్ నుంచి.. ఆశీష్‌కుమార్‌యాదవ్

అమరవీరుల త్యాగం అజరామరం



అమరులకు నివాళులర్పిస్తున్న తెలుగు వర్సిటీ ఉద్యోగులు

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగం అజరామరమని తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం తెలుగు వర్సిటీలోని తెలుగు తల్లి విగ్రహం ముందు అమరవీరుల స్మారక దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1969లో సింగరేణి ఉద్యోగుల నియామకపు వివక్షతో ప్రారంభమైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష అంచెలంచెలుగా వివిధ కోణాలలో రూపాంతరం చెందిందని గుర్తు చేశారు. ఉద్యమ తీవ్రతలో విజయ సాధననే లక్ష్యంగా ఆత్మబలిదానాలు చేసుకుని ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంలో కీలక పాత్ర వహించిన ఉద్యమ అమరులు చిరకాల కీర్తిని పొందుతారని, వారిని తెలంగాణ జాతి మరువదని శ్లాఘించారు.

ఇంటింటికీ బీజేపీ

గౌలిపురా: పార్టీ పిలుపు మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ఆదర్ల మహేశ్ అన్నారు. జన సంపర్క అభ్యాన్‌లో భాగంగా గురువారం గౌలిపురా డివిజన్ పోలింగ్ బూత్ నంబర్–44లోని సీఐబీ క్వార్టర్స్‌లో అంబేద్కర్ శక్తి కేంద్రం డొంకి యాదగిరి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన ప్రగతి, చేపట్టిన పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర నిర్వహించారు. భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు చర్మాణి రూప్‌రాజ్, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ చంద్రశేఖర్, యాకుత్‌పురా కన్వీనర్ గౌలీకర్ ధీరజ్‌లాల్, మహేందర్, ఎం.ధర్మానంద్ పాల్గొన్నారు.

